సాక్షి సూర్యాపేట

బుధవారం : 27 : మార్చి : 2024




నష్టపరిహారం చెల్లించాలి

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ కోరారు. - 8లో



పార్టీ మార్పు సాధారణమైంది

ప్రస్తుత రాజకీయాల్లో పార్టీ మార్పు సాధారణమైపోయిందని సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. - 8లో



న్యూస్‌రీల్

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

సూర్యాపేటటౌన్ : పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 67 సెంటర్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం భౌతికరసాయన శాస్త్రం పరీక్ష నిర్వహించారు. మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 11,946 మంది విద్యార్థులకు గాను 11,905 మంది విద్యార్థులు హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారు. అలాగే గత సంవత్సరం పరీక్ష ఫెయిలైన వారు 71 మందికి గాను 67 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో పరీక్ష కేంద్రాలను డీఈఓ అశోక్ తనిఖీ చేశారు.

కోదాడ వైస్ ఎంపీపీ ఎన్నిక నేటికి వాయిదా

కోదాడరూరల్ : కోదాడ మండల వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం వైస్ ఎంపీపీ ఎన్నికను నిర్వహించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ ఎంపీటీసీలు సమయానికి రాకపోవడంతో తిరిగి నిర్వహించేందుకు ఎన్నికల అధికారి, ఆర్డీఓ సూర్యానారాయణ బుధవారానికి వాయిదా వేశారు. మండలంలో ప్రస్తుతం 9 మంది ఎంపీటీసీలు ఉండగా నలుగురు ఎంపీటీసీలు మాత్రమే మండల పరిషత్ కార్యాలయానికి వచ్చినా సమావేశమందిరానికి రాకపోవడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

రెండు నెలల పదవికి తీవ్ర పోటీ

ప్రస్తుత పాలకవర్గ పదవి గడువు మరో రెండు నెలలు ఉంది. అయితే ఈ రెండు నెలల పదవి కోసమే ముగ్గురు ఎంపీటీసీలు తీవ్రంగా పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్నా తొగర్రాయి లిక్కి వెంకటయ్య భార్య స్థానిక ఎంపీటీసీ గుర్వమ్మ ఈపదవి కోసం పోటీ పడుతుండగా ఎంపీపీ ఎన్నికకు మద్దతు తెలిపి కాంగ్రెస్ పార్టీకి దగ్గరగా ఉంటున్న చిమిర్యాల, నల్లబండగూడెం బీఆర్ఎస్ ఎంపీటీసీలు ఇద్దరు కూడా తమకు పదవి కావాలని పట్టుపడుతున్నారు.

నృసింహుడికి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

వీబీకేల అవినీతిపై విచారణ జరపాలి

- కలెక్టరేట్ ఎదుట పాత్రర్లపహాడ్ సంఘబంధం సభ్యుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పాత్రర్లపహాడ్ సంఘబంధం సభ్యులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఆత్మకూర్ (ఎస్)మండలం పాతర్లపాడు గ్రామంలో సంఘబంధాల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ఆ సంఘబంధం సభ్యులు పులి వినోద, బొలక పద్మ, భీమగాని రాధమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదురుగా నిరసన తెలిపి కలెక్టర్ వెంకటరావుకు వినతిపత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గుంటూరు తిరుమలమ్మ, మద్దికుంట్ల రాధ, కొప్పుల మానసలు పాతర్లపహాడ్ గ్రామంలో విలేజ్ బుక్ కీపర్ (వీబీకే)లుగా పని చేస్తున్నారని తెలిపారు. వీరు పదేళ్ల నుంచి పనిచేస్తూ అమాయకులైన సభ్యుల బుక్కులు దగ్గర పెట్టుకొని వారి చేత సంతకాలు పెట్టించుకుంటున్నారని, లక్షాలాది రూపాయిలు సభ్యుల పేరుతో కాజేశారని ఆరోపించారు. కార్యక్రమంలో గాదగాని శోభ, పబ్బతి గంగమ్మ, యమగాని లక్ష్మి, గుంటూరు లలిత గంగపురి స్వర్ణ పాల్గొన్నారు.

సైదిరెడ్డిని మార్చాలని పట్టు

- ఎన్నికల్లో సహకరించబోమంటూ అధిష్టానానికి తేల్చిచెప్పిన బీజేపీ నేతలు
- పార్టీ నిర్ణయం మారదని వారికి స్పష్టం చేసిన రాష్ట్ర అధ్యక్షుడు
- ఒక వేళ అభ్యర్థిని డ్రాప్‌చేయిస్తే పునరాలోచన చేస్తామన్న కిషన్‌రెడ్డి
- ఎవరో వెనకుండి చేయిస్తున్నారని సైదిరెడ్డి అనుచరుల మండిపాటు
- చిన్నపరెడ్డి బీజేపీలో చేరితే ఆయనకు అవకాశం ఉంటుందని చర్చ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిని మార్చాలంటూ ఆ పార్టీ జిల్లా నేతలు పట్టుపడుతున్నారు. ఇటీవల బీజేపీలో చేరిన హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ టికెట్‌ను బీజేపీ అధిష్టానం ప్రకటించింది. టికెట్ ప్రకటించిన మొదట్లో పెద్దగా పట్టించుకోని ఆ పార్టీ శ్రేణులు పది రోజుల తర్వాత మాత్రం ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా మంగళవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. సైదిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పార్టీ నేతలపై కేసులు పెట్టించారని, ఇప్పుడు ఆయనకు టికెట్ ఎలా ఇస్తారని ఆరోపించారు. వారి అభిప్రాయాలను విన్న కిషన్‌రెడ్డి .. పార్టీ ఒక నిర్ణయం తీసుకున్న తరువాత వెనక్కి తగ్గేది ఉండదని స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే పార్టీ ప్రకటించిన అభ్యర్థి తనకు తాను డ్రాప్ అయితే పార్టీ మరో ఆలోచన చేసే అవకాశం ఉంటుందని, ఆయన డ్రాప్ అవుతారా? మీరు ఒప్పించి డ్రాప్ చేయిస్తారా? మీ ఇష్టం అని తెలియజేసినట్లు సమాచారం. ఇందుకోసం బుధవారం ఒక్క రోజు గడువు ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. పార్టీ మాత్రం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోదని, ఈనెల 28వ తేదీన జరిగే సమావేశం నాటికి ఉండే పరిస్థితి మేరకు ముందుకు వెళతామని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో పార్టీ శ్రేణులు వెనుదిరిగినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారంలో ఎవరో ఒకరు కావాలనే నేతలతో పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయిస్తున్నారని నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి అనుచరులు మండి పడుతున్నారు. అభ్యర్థిని ప్రకటించిన సమయంలో లేని వ్యతిరేకత పది రోజుల నుంచి ఎలా వచ్చిందని, దాని వెనుక ఎవరో ఉండి చేయిస్తున్నారని పేర్కొంటున్నారు.

చిన్నపరెడ్డి బీజేపీలో చేరుతారా?

ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తేరా చిన్నపరెడ్డి బీజేపీలో చేరే అవకాశం ఉందన్న అభిప్రాయం ఆ పార్టీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది. ఆయన బీజేపీలో చేరితే నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తారన్న చర్చ కూడా జరుగుతోంది. అయితే పార్టీ ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థిని మార్చే అవకాశం లేదని.. అభ్యర్థిని డ్రాప్ చేయిస్తే మరో ఆలోచన చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సైదిరెడ్డిని డ్రాప్ చేయించి.. చిన్నపరెడ్డికి టికెట్ ఇస్తారా.. ఒకవేళ టికెట్ రాకున్నా చిన్నపరెడ్డి పార్టీలో చేరుతారా.. లేదా.. అన్నది నేడో రేపో తేలనుంది.

● నేను ఓటు వేస్తాను



కలెక్టరేట్‌లో మంగళవారం సెల్ఫీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 'నేను ఓటు వేస్తా.. ఎందుకంటే.. నేను ఇండియన్' అనే నినాదంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సెల్ఫీ కేంద్రంలో కలెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్ బీఎస్. లత ఫొటో దిగారు. - దురాజ్‌పల్లి (సూర్యాపేట)

500 క్యూసెక్కుల సాగు నీరు విడుదల

- సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు నీరు చేరడం కష్టమే
- నీటిని పెంచి చివరి భూములకు అందించాలని రైతుల విజ్ఞప్తి

అర్వపల్లి: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) రెండో దశ ఆయకట్టుకు మంగళవారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం బయ్యన్నవాగు నుంచి 500 క్యూసెక్కుల నీటిని జిల్లాకు విడుదల చేశారు. రైతుకు కన్నీటి కష్టం! శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నీళ్లు 69,70,71 మూడు డిస్ట్రిబ్యూటర్లకు వెళ్లాల్సి ఉంటుంది. కాగా, తక్కువ నీళ్లు వదలడంతో మంగళవారం రాత్రి వరకు కూడా అర్వపల్లికి చేరలేదు. ఇక్కడి నుంచి నీళ్లు సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు కూడా వెళ్లాల్సి ఉంది. ఈ సీజన్‌లో ఆరో విడతగా(చివరి విడత) ఈనెల 23 నుంచి నీళ్లు రావాల్సి ఉంది. ప్రస్తుతం వదిలిన 500 క్యూసెక్కులు వదిలిన ప్రాంతం నుంచి కొద్ది దూరం వరకు రావడమే కష్టం. గత విడతల్లో 2 వేల క్యూసెక్కుల వరకు నీటిని వదిలితేనే సూర్యాపేట ప్రాంతానికి నీళ్లు చేరేవి. ప్రస్తుతం వదిలే నీటిని పెంచితే తప్ప ఇక్కడకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈసారి ఎలాగైనా నీటిని పెంచి చివరి భూములకు నీళ్లు చేరేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



71డీబీఎం కాలువకు రాని నీళ్లు

ఓసీనా.. బీసీనా..!

భువనగిరి ఎంపీ టికెట్‌పై కాంగ్రెస్ తర్జనభర్జన

- ఓసీనే బరిలో నిలపాలని భావిస్తున్న అధిష్టానం
- బీసీలకు ఇవ్వాలని ప్రతిపాదించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- బీజేపీ, బీఆర్ఎస్ ఇవ్వడంతో కాంగ్రెస్ కూడా బీసీకే ఇవ్వాలని సూచన
- నేడో రేపో అభ్యర్థిని ప్రకటించే అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ భువనగిరి ఎంపీ టికెట్ ఎవరికివ్వాలన్న దానిపై ఆ పార్టీ తర్జనభర్జన పడుతోంది. ఇప్పటికే భువనగిరి టికెట్ తనకు ఇవ్వాలని, ఏడాదిన్నరనుంచి నియోజకవర్గంలో పని చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పట్టు పడుతుండగా, వివిధ సర్వేల తరువాత అధిష్టానం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిని పోటీలో నిలపాలని ఆయనపై ఒత్తిడి తెస్తోంది. ఆ ఇద్దరిలో ఎవరో ఒకరికి టికెట్ ఖరారు అవుతుందనుకున్న నేపథ్యంలో బీసీ అంశం తెరపైకి వచ్చింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకే ఎంపీ టికెట్ ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కూడా బీసీకే టికెట్ ఇవ్వాలన్న చర్చ తెరపైకి రావడంతో హస్తం పార్టీ ఆలోచనలు చేస్తోంది.

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో తెరపైకి బీసీ అంశం

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భువనగిరి టికెట్‌ను ఓసీకే ఇవ్వాలన్న ఆలోచనతో ఉంది. ఈ మేరకు కోమటిరెడ్డి లక్ష్మి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్లను సీరియస్‌గా పరిశీలించింది. ఈ క్రమంలో 'బీసీకి టికెట్ ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదు.. బీసీలకు ఇవ్వాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి చెప్పాను. బీసీకి ఇస్తే రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం. కోమటిరెడ్డి లక్ష్మికి టికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేయలేదు, టికెట్ ఇవ్వాలని అడగలేదు. అసత్య ప్రచారాన్ని కార్యకర్తలు నమ్మొద్దు. పార్టీ చేయించుకున్న సర్వేలో కోమటిరెడ్డి కుటుంబం పోటీ చేస్తేనే గెలుస్తుందని వెల్లడైందని చెబుతున్నారు. మీరే పోటీ చేయాలని అధిష్టానం పట్టుబడితే ఆలోచిస్తా.' అని ఇటీవల మునుగోడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు. దీంతో బీసీ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎవరికి టికెట్ వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

బీసీకి ఇవ్వాల్సి వస్తే అభ్యర్థి ఎవరు?

భువనగిరిలో నియోజకవర్గంలో ఎవరిని బరిలో నిలపాలన్న విషయంలో పార్టీ అధిష్టానం నియోజకవర్గంలోని ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని కూడా సేకరించినట్లు తెలిసింది. మెజారిటీ ఎమ్మెల్యేలు ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని చెప్పినట్లు సమాచారం. వీలున్నంత వరకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇచ్చేలా చూడాలని సూచించారు. ఒక వేళ రెడ్డి సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వకపోతే ఆ స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇచ్చినా అభ్యంతరం లేదని పేర్కొన్నట్లు తెలిసింది. అయితే గతంలో ఎమ్మెల్యేల అభిప్రాయం, ఇటీవల రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో బీసీ అంశం ముందుకొచ్చింది. బీసీకి టికెట్ ఇవ్వాలంటే అక్కడ బలమైన నాయకుడు కనిపించడం లేదన్న చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్సీ నేతి విద్యాసాగర్, పున్నా కైలాష్‌నేత వంటి నాయకులు టికెట్ అడుగుతున్నారు. అయితే పున్నా కై లాష్‌కు ఆర్థికంగా ఎదుటి పార్టీలను ఢీకొనే సామర్థ్యం లేదనే వాదన ఉంది. మరోవైపు మధుయాష్కి వంటి వారి పేరు తెరపైకి తెస్తున్నారు.

నేడు సీఈసీ భేటీలో ఖరారయ్యే అవకాశం

టికెట్ కేటాయింపు విషయంలో ఈనెల 27వ తేదీన కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం కీలకంగా మారింది. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎవరన్నది ఖరారు చేసే అవకాశం ఉంది. 28న లేదా 30వ తేదీన అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకుడు ఒకరు పేర్కొన్నారు.

మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు, చిత్రంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పీఓ, ఏపీఓల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పీఓ, ఏపీఓల ఎంపిక పూర్తి అయిందనితెలిపారు. ఎన్నికల నిర్వహణకు 5,664 మంది సిబ్బందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేయనున్న శిక్షణ కార్యక్రమాల్లో పీఓ, ఏపీఓలు తప్పక హాజరు అయ్యేవిధంగా ఆయా నియోజక అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదిశగా ఏర్పాట్లను చేపట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. కార్యక్రమంలో సీఈఓ అప్పారావు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, ఏఓ సుదర్శన్ రెడ్డి, నరేందర్, ఈడీఎం గఫర్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 1నుంచి ధాన్యం కొనుగోళ్లు

యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటరావు సూచించారు. మంగళవారం యాసంగి పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎంఆర్‌పై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. తదుపరి జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏప్రిల్ 1 నుంచి యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలో 221 వరి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను దాదాపు 3.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్ బాబు, సీపీఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, సివిల్ సప్లయీస్ డీఎం రాములు, జిల్లా మార్కెటింగ్ అధికారి శర్మ పాల్గొన్నారు.

రూ.6కోట్ల విలువైన భూమికి ఎసరు

కోదాడలో పట్టణ ప్రకృతి వనాల కబ్జాకు యత్నం

- ఒక చోట రాత్రికి రాత్రే ఫెన్సింగ్ తొలగింపు
- మరోచోట ఫెన్సింగ్‌ను పూర్తిగా మాయం చేసిన కేటుగాళ్లు



పట్టణ ప్రకృతి వనం లోపల మున్సిపాలిటీ వేసిన ఫెన్సింగ్ తొలగించిన అక్రమార్కులు

కోదాడ: కోట్ల రూపాయల మున్సిపాలిటీ ఆస్తులను కొందరు అక్రమార్కులు చెరబట్టారు. ఏకంగా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన రెండు పట్టణ ప్రకృతి వనాలనే ఆక్రమించడానికి సిద్ధమయ్యారు. మున్సిపాలటీ వారు ప్రకృతి వనాల చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లను రాత్రికి రాత్రే మాయం చేయడంతో పాటు అందులో నాటిన మొక్కల ఆనవాళ్లు లేకుండా చేశారు. ఒక చోట దాదాపు 1,500 గజాల ప్రకృతివనాన్ని దొడ్డిదారిన అమ్మకానికి పెట్టారని, మరో చోట ఓ గ్రానైట్ వ్యాపారి స్థలానికి దారి కోసం ప్రకృతివనంలోని 1000 గజాల స్థలానికి ఫెన్సింగ్ తొలగించారు. ఈ రెండు చోట్ల కబ్జాకు యత్నిస్తున్న స్థలం విలువ దాదాపు 6కోట్ల రూపాయల పైమాటేనని పలువురు అంటున్నారు.

అసలు విషయం ఏమిటంటే...

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ వద్ద కోదాడకు చెందిన ఓ రియల్ ఏస్టేట్ వ్యాపారి మున్సిపాలిటీకి లే- అవుట్ కింద 10శాతం స్థలం ఇచ్చారు. ప్రస్తుతం కొమరబండ చెరువు ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఉన్న లేక్‌వ్యూ అతిథిగృహం సమీపంలో ఉన్న ఈ స్థలం విస్తీర్ణం సుమారు 1500 గజాలు. ఈ స్థలంలో మూడేళ్ల క్రితం మున్సిపాలిటీ అధికారులు దాదాపు లక్ష రూపాయల వ్యయం చేసి దాని చుట్టూ ఫెన్సింగ్, గేటు ఏర్పాటు చేయడంతో పాటు అందులో మొక్కలను కూడా నాటారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇటీవల కొందరు ఈ పట్టణ ప్రకృతి వనం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను రాత్రికి రాత్రే తొలగించారు. అందులో వేసిన కొన్ని మొక్కలు ఎండిపోగా మిగిలిన వాటిని వీరు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఈ స్థలాన్ని కొందరు తమదేనని చెప్పి అగ్రిమెంట్ మీద ఇతరులకు అమ్మినట్లు సమాచారం. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలం ఖరీదు సుమారు రూ.3కోట్ల పైమాటేనని పలువురు అంటున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులు మాత్రం దీని మీద స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ సమీపంలో ఉన్న పట్టణ ప్రకృతివనం, కేఎల్ఆర్ వద్ద పట్టణ ప్రకృతి వనం ఫెన్సింగ్ తొలగించి తీసుకెళ్లినవారిపై కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాము. అక్కడ తిరిగి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాము.

– అంబటి రమాదేవి, మున్సిపల్ కమిషనర్

రాత్రికి రాత్రే..

కోదాడ పట్టణ శివారు గ్రామంగా కొమరబండ ఉంటుంది. దాదాపు 20 సంవత్సరాల క్రితం అక్కడ కేఎల్ఆర్ గేటెడ్ కమ్యూనిటీ పేరుతో ఓ కాలనీ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి వైపు లే అవుట్ కింద మున్సిపాలిటీకి ఎకరంస్థలాన్ని ఇచ్చారు. ఈ స్థలాన్ని నాడు పంచాయతీగా ఉన్న కొమరబండ పాలకవర్గం పట్టించుకోలేదు. ఆ స్థలాన్ని సమీపంలో ఉన్న ఓ పాఠశాల వారు రాకపోకలకు ఉపయోగించుకుంటున్నారు. తరువాత మున్సిపాలిటీలో ఈ గ్రామం విలీనమైంది. మూడేళ్ల క్రితం కాలనీ వాసులంతా ఈ స్థలం కాలనీకి చెందినదని అధికారులతో పెద్ద పోరాటమే చేశారు. దీంతో మున్సిపాలిటీ అధికారులు దాన్ని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇటీవల కొందరు ఈ పట్టణ ప్రకృతి వనంలో కొంత భాగం ఫెన్సింగ్ రాత్రికి రాత్రే తొలగించారు. దీని వెనక ఓ గ్రానైట్ వ్యాపారి స్థలానికి దారి కోసం ఈ ఫెన్సింగ్ తొలగించినట్లు సమాచారం. ఈ వ్యవహారం భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ గజం స్థలం విలువ 30 వేలు పైమాటే. ఇక్కడ మూడు కోట్ల రూపాయల విలువ చేసే వెయ్యి గజాలు ఆక్రమణకు తెరలేపారు.



కేఎల్ఎఆర్ సమీపంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం (వృత్తంలో ప్రకృతివనం గేట్)

క్లుప్తంగా

తండ్రి చనిపోయిన బాధలోనూ పరీక్షకు హాజరు


పరీక్షకు హాజరైన గాయత్రి

త్రిపురారం: తండ్రి చనిపోయిన బాధలోనూ పదో తరగతి వార్షిక పరీక్షకు హాజరైంది ఓ విద్యార్థిని. వివరాలు.. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన తొడబోయిన చంద్రశేఖర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. సోమవారం చంద్రశేఖర్ వృత్తిరీత్యా గ్రామంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. అదే సమయంలో అనారోగ్యానికి గురై కిందపడిపోయాడు. తోటి జాలరులు గమనించి వెంటనే మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు సూచన మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. చంద్రశేఖర్ పెద్ద కుమార్తె గాయత్రి మండలంలోని కంపాసాగర్ టీఎస్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతుంది. ఓ వైపు ఇంటి వద్ద తండ్రి మృతదేహం ఉన్నప్పటికీ దుఃఖాన్ని దిగమింగుకొని మంగళవారం గాయత్రి పదో తరగతి పరీక్షకు హాజరైంది.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

- మరొకరికి స్వల్ప గాయాలు


స్వామి (ఫైల్)

మునుగోడు: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కిందపడిపోయి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మునుగోడు మండలంలోని కచలాపురం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని ఎల్లగూడెం గ్రామానికి చెందిన తిరిపారి స్వామి(22) సోమవారం రాత్రి తన బైక్‌పై మరో యువకుడితో కలిసి మునుగోడుకు వచ్చాడు. తిరిగి రాత్రి 8గంటల సమయంలో తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో జక్కలవారిగూడెం-కచలాపురం గ్రామాల మధ్య మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు కిందపడిపోయారు. బైక్‌పై వెనుక యువకుడికి స్వల్ప గాయాలు కాగా.. బైక్ నడుపుతున్న స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే స్వామి మృతిచెందాడు. మృతుడి తండ్రి భిక్షం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు.

చికిత్స పొందుతూ భిక్షగాడు మృతి


మృతిచెందిన భిక్షగాడు

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని భిక్షగాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.
చిట్యాల ఎస్ఐ-2 కె. లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణ శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ నెల 5వ తేదీన నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని భిక్షగాడిని (65) గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండున్నరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

- నిద్రిస్తున్న బాలికను తీసుకెళ్లి అఘాయిత్యం
- బాలిక పరిస్థితి ఆందోళనకరం.. హైదరాబాద్‌కు తరలింపు
- పోలీసుల అదుపులో నిందితుడు



చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. అభం శుభం తెలియని రెండున్నరేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లి పక్కలో నిద్రిస్తున్న బాలికను తీసుకెళ్లి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. కామపిశాచి దాడి కారణంగా ఆ చిన్నారి పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులోని రసాయన పరిశ్రమల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. వారందరికీ కంపెనీ యాజమాన్యమే పరిసరాల్లో గదులు కేటాయిస్తుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మహారాజ్‌గంజ్ జిల్లాలోని ఆనంద్‌నగర్ పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పనిచేసేందుకు కొద్దిరోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. కొందరు సింగిల్‌గానే ఉంటుండగా మరికొందరు మాత్రం భార్యాపిల్లలను సైతం తీసుకువచ్చారు. ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో అందరూ కలిసి ఒకే గదిలో ఉంటున్నారు. ఆ క్రమంలో సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో బాధిత చిన్నారి తన తల్లి పక్కలో నిద్రిస్తుంది. అదే సమయంలో తల్లితోపాటు మిగతా వ్యక్తులు సైతం నిద్రలోనే ఉన్నారు. ఆ సమయంలో శివ(24) అనే యువకుడు నిద్రిస్తున్న చిన్నారిని ఇంట్లో నుంచి ఎత్తుకొని బయటకి తీసుకెళ్లాడు. సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. కొంతసేపటి తర్వాత నిద్రలేచిన తల్లి పక్కలో చిన్నారి లేకపోవడంతో మిగతా వ్యక్తులను నిద్రలేపింది. అందరూ కలిసి ఆరుబయట వెతకసాగారు. అప్పటికే యువకుడి చేతిలో అఘాయిత్యానికి గురైన చిన్నారి రోదించసాగింది. రోదనలు వినిపించడంతో అక్కడికి వెళ్లి చిన్నారిని తీసుకొచ్చారు. తప్పించుకునేందుకు నిందితుడు ప్రయత్నించగా అందరు కలిసి పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని వైద్యం కోసం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్టు సమాచారం.మంగళవారం పోలీసులు ఘటనాస్థలానికి నిందితుడిని తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తంగడపల్లిలో చైన్ స్నాచింగ్

- వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగ

చౌటుప్పల్: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఓ యువకుడు లాక్కెళ్లాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. తంగడపల్లి గ్రామానికి చెందిన రాచకొండ పుష్పమ్మ ఇంటి ఇంటి పరిసరాల్లో గత మూడు రోజులుగా ఓ యువకుడు తిరుగుతున్నాడు. మొదటి రోజు పుష్పమ్మ వద్దకు వెళ్లి «నీ కుమారుడు గిరి ఉన్నాడా?» అని ఆమెను అడిగాడు. తన కుమారుడి పేరు చెబుతున్నాడంటే తెలిసిన వ్యక్తేనని పుష్పమ్మ భావించింది. అలా మూడు రోజులు ఎంతో నమ్మకంగా వ్యవహరించాడు. సోమవారం సాయంత్రం తర్వాత ఇంటి ముందు కూర్చున్న పుష్పమ్మ వద్దకు వెళ్లిన సదరు యువకుడు ఆమెతో మాటలు కలిపి, కొద్దిసేపటి తర్వాత తాగడానికి మంచి నీళ్లు కావాలని అడిగాడు. దీంతో పుష్పమ్మ నీళ్ల తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లగా.. ఆమె వెనకాలే వెళ్లిన సదరు యువకుడు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా చోరీకి పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులో వృద్ధుడి మృతి


మృతిచెందిన రాందాస్

చిట్యాల: ఆర్టీసీలో బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాలలో మంగళవారం జరిగింది. వివరాలు.. భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన బదావత్ రాందాస్(60) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో తన భార్యతో కలిసి వైద్య చికిత్స నిమిత్తం ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో బస్సు చిట్యాల పట్టణ శివారులోకి రాగానే రాందాస్‌కు గుండెలో నొప్పి వచ్చింది. దీంతో బస్సులోని పలువురు అతడికి సీపీఆర్ చేసే ప్రయత్నం చేశారు. బస్సును డ్రైవర్ చిట్యాల పోలీస్ స్టేషన్ ఎదుట నిలిపి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అక్కడకు చేరుకుని రాందాస్ పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రాందాస్ మృతదేహాన్ని పోలీసులు మరో వాహనంలో భద్రాద్రి కొత్తగూడెంకు పంపించారు. అనంతరం బస్సు హైదరాబాద్‌కు బయల్దేరింది.

ఎక్సైజ్ అధికారుల దాడులు.. ముగ్గురిపై కేసు


పట్టుబడ్డ నిందితులతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: ఎక్సైజ్ అధికారులు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి 11 లీటర్ల సారా, 200 కిలోల బెల్లం, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. మంగళవారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం ఎరక్రుంటతండాకు చెందిన అంగోతు గోపి, పద్య ప్రసాద్ మఠంపల్లి మండలం రఘునాథపాలెంకు సారా తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 6లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా చింతలపాలెం మండలం ఎరక్రుంటతండాకి చెందిన గుగులోతు రమేష్ ఇంట్లో 5లీటర్ల సారా, 200 కిలోల బెల్లంను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఆయా వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐలు జగన్మోహన్‌రెడ్డి, దివ్య, సిబ్బంది నాగరాజు, రుక్మారెడ్డి, నరేష్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్


ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల తదితరులు

నేరేడుచర్ల: ఎండిపోయిన పంటలకు సంబంధించి ప్రతి ఎకరానికి ప్రభుత్వం రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని బట్టువానికుంటలో ఎండిపోయిన వరి చేలను ఆయన పరిశీలించి మాట్లాడారు. భూగర్భజలాలు అడుగంటి ఎండిపోతున్న పంటను నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేయించి కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేకపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగానే 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి 180 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. సాగర్ జలాశయంలో 513 అడుగుల నీరు ఉన్నందున నీటిని విడుదల చేసి చెరువులను నింపి భూగర్భజలాలను పెంచి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. రైతులు పండించిన పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, రూ.15వేలు రైతు బంధు, రుణమాఫీ తదితర డిమాండ్ల సాధనకై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతామని అన్నారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నాగండ్ల శ్రీధర్, కడియం వెంకట్‌రెడ్డి, నాయకులు అన్నబోయిన సైదులు, ఎల్లబోయిన లింగయ్య, నాగరాజు, సుందరయ్య, నర్సింహారావు, పిచ్చిరెడ్డి, శ్రీను, వినాయకరావు, వెంకన్న, నాగార్జున, భరత్, హుస్సేన్ తదితరులున్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

ఆలేరురూరల్: చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలేరు పట్టణ కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన డి. శివ(28)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకొని వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో నిత్యం మద్యం తాగేవాడు. అతడి మానసికస్థితి సరిగా లేక భార్యాపిల్లలను పట్టించుకోకపోవడం లేదు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఆలేరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

వ్యాపారం సరిగ్గా నడవక బలవన్మరణం

కోదాడరూరల్: వ్యాపారం సరిగ్గా నడవక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబండగూడేనికి చెందిన ఎస్. కిరణ్(26) రామాపురం క్రాస్ రోడ్డులో కూల్‌డ్రింక్ షాప్ పెట్టాడు. ఆ షాప్ సరిగ్గా నడవడం లేదని మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనికి వెళ్లిన అతడి కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ.2.85కోట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీలను మంగళవారం ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి ఆధ్వర్యంలో కొండ దిగువన గల సత్యనారాయణస్వామి వ్రత మండపంలో లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.2,85,02,418 నగదు, 425 గ్రాముల మిశ్రమ బంగారం, 5కిలోల 960 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఇక అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, యూఏఈ, యూరప్, మలేషియా, నేపాల్, కెనడా, భూటాన్, ఒమన్, సౌదీ అరేబియా, జార్జియా వంటి దేశాలకు చెందిన కరెన్సీ సైతం హుండీల్లో వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ హుండీ ఆదాయం 35 రోజులదని వారు తెలిపారు.


హుండీ నగదు లెక్కిస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం


రాంబాయమ్మ (ఫైల్)


వెంకటనర్సయ్య (ఫైల్)


ఘటనా స్థలంలో రాంబాయమ్మ, వెంకటనర్సయ్య మృతదేహాలు

మునగాల(కోదాడ): బైక్‌పై వెళ్తున్న తల్లీకుమారుడు ట్రాక్టర్ ఢీకొట్టి దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మునగాల మండలంలోని ఆకుపాముల శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానిక ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామానికి చెందిన తమ్మారపు రాంబాయమ్మ(48) భర్త గతంలోనే మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం రాంబాయమ్మ, ఆమె రెండో కుమారుడు వెంకటనర్సయ్య(25) బైక్‌పై సూర్యాపేట పట్టణంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో మునగాల మండలం ఆకుపాముల శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వీరు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాంబాయమ్మ, వెంకటనర్సయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకునపోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా వెంకటనర్సయ్యకు గత సంవత్సరమే వివాహం కాగా అతడి భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉన్నట్లు తెలిసింది.

వ్యక్తికి గాయాలు..

పెన్‌పహాడ్: మండల పరిధిలోని దూపహాడ్ గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన అనంతు నాగరాజు మంగళవారం సూర్యాపేట నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు

- ఏటీఎం వద్ద దొరికిన నగదు పోలీస్ స్టేషన్‌లో అప్పగింత


బాధితుడికి నగదును అందజేస్తున్న ఎస్ఐ మల్లయ్య, మహేష్

రామన్నపేట: ఏటీఎం వద్ద ఓ వ్యక్తి వదిలి వెళ్లిన డబ్బును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడో ఓ యువకుడు. వివరాలు.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన ఆవనగంటి మహేష్ మంగళవారం ఉదయం 9.30గంటల సమయంలో మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఏటీఎం వద్దకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. తన ఏటీఎం కార్డుతో డబ్బులు తీసేందుకు ప్రయత్నిస్తుండగా.. ఏటీఎం మిషన్ వద్ద నగదు కనిపించింది. వెంటనే అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నగదును ఎస్ఐ పి. మల్లయ్యకు అప్పగించాడు. అయితే నీర్నెముల గ్రామానికి చెందిన కట్ట కుమార్ ఉదయం 9గంటల సమయంలో మూడు దఫాలుగా డబ్బులు డ్రా చేశాడు. ఫోన్ మాట్లాడుతూ.. మూడవసారి డ్రా చేసిన డబ్బులు తీసుకోకుండానే వెనుదిరిగాడు. చీటీ డబ్బులు కట్టే సమయంలో చూసుకోగా డబ్బులు తక్కువగా ఉండడంతో బ్యాంకు అధికారులకు సమాచారం అందించాడు. అధికారులు సీసీ ఫుటేజీ పరిశీలించి మహేష్ తీసుకున్నట్లు గుర్తించి ఫోన్ చేశారు. డబ్బులు పోలీసులకు అప్పగించినట్లు తెలుపడంతో ఇరువురు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఆధారాలు పరిశీలించిన ఎస్ఐ బాధితుడికి డబ్బులు అందజేశారు. యువకుడి నిజాయితీని ఎస్ఐ పి. మల్లయ్య, వైస్ఎంపీపీ నాగటి ఉపేందర్ అభినందించారు.

పార్టీ మార్పు సాధారణమైంది

- పదవి లేకపోతే ఉండలేకపోతున్నారు
- రేవంత్‌రెడ్డి పాలన ప్రశంసనీయం
- కాంగ్రెస్ పార్టీ కూటమి చర్చలపై ఆహ్వానం రాలేదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సాక్షి యాదాద్రి: ప్రస్తుత రాజకీయాల్లో పార్టీ మార్పు సాధారణమైపోయిందని, పదవి లేకపోతే ఉండలేకపోతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. మంగళవారం యాదాద్రి జిల్లా భువనగిరిలో నిర్వహించిన పార్లమెంట్ స్థాయి నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారిపోతున్నారని, దీంతో ప్రతిపక్షం ఖాళీ అవుతోందన్నారు. డబ్బున్న వ్యాపారస్తులే ఎంపీలు, ఎమ్మెల్యేలు అవుతున్నారని, దీనిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బ్యాంకుల ద్వారా అవినీతికి చట్టబద్ధత తెచ్చిన బీజేపీ రాజకీయాలు అవకాశవాదంగా మారాయని విమర్శించారు. బీజేపీకి రూ.8 వేల కోట్లు, కాంగ్రెస్‌కు రూ.2 వేల కోట్లు, బీఆర్ఎస్ పార్టీకి రూ.25వేల కోట్లు విరాళాలు వచ్చాయన్నారు. ఎలక్టోరల్ బాండ్లను సీపీఎం ముందే వ్యతిరేకించిందన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన ప్రశంసనీయంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

కూటమి ఏర్పాటుకు సిద్ధం..

కాంగ్రెస్ పార్టీ కూటమి చర్చలపై తమకు ఆహ్వానం లేదని, కూటమి ఏర్పాటుపై సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో సీపీఎం బలహీన పడిన విషయం వాస్తవమేనని అన్నారు. బీజేపీ ప్రభుత్వంలో మహిళల అభివృద్ధి జరగకపోగా వారిపై విపరీతంగా దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ఆరోపించిన విధంగా ఔటర్ రింగ్ రోడ్‌లో అవినీతి జరిగిందనే విషయం నేడు స్పష్టమవుతోందని తెలిపారు. ఆ కంపెనీ నుంచి రూ.25 వేల కోట్లు బీఆర్ఎస్‌కు అందాయని ఆరోపించారు. గతంలో బీజేపీ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ పరికరాలు కొనుగోలు చేసిన విధంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కొనుగోలు చేసిందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎండీ జహంగీర్, కొండమడుగు నర్సింహ పాల్గొన్నారు.

మగ శిశువు లభ్యమైన ఘటనపై విచారణ


ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ కవిత

చందూరు: మండలంలోని బంగారుగడ్డ గ్రామంలో మగ శిశువు లభ్యమైన ఘటనపై మంగళవారం పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు విచారణ చేపట్టారు. ఇటుక బట్టీల్లో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలను ఐసీడీఎస్ సీడీపీఓ కవిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో ఎవరైనా గర్భవతిగా ఉన్నారా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివేషా, సుజాత, టీచర్లు పాల్గొన్నారు.

రైతన్నకు కన్నీటి కష్టాలు


ఎండిపోతున్న చేనుకు ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతు

భువనగిరి రూరల్: భువనగిరి మండల పరిధిలోని గ్రామాలలో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. దీంతో రైతులు సాగుచేసిన వరి పంట నీరు లేక ఎండిపోతుంది. ఎలాగైనా పంటను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వేల రూపాయలు చెల్లిస్తూ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా పొలానికి నీరు పెడుతున్నారు. భువనగిరి మండలం గౌస్‌నగర్ గ్రామంలో చంద్ర మల్లయ్య అనే రైతు 3ఎకరాల్లో వరి సాగు చేశాడు. భూగర్భజలాలు అడుగంటడంతో బోరు పోయక.. ఎలాగైనా వరి చేను చేతికందాలన్న ఆశతో రోజు ట్యాంకర్లతో చేనుకు నీరందిస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దొంగల ముఠా అరెస్ట్

- వైన్ షాపులే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న నిందితులు
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీసీ రాజేష్‌చంద్ర


వివరాలు వెల్లడిస్తున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి క్రైం: రాత్రివేళ వైన్ షాపులే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న ముఠాను భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర మంగళవారం విలేకరులకు వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు రోజుల క్రితం రాత్రి సమయంలో తుర్కపల్లి మండల కేంద్రంలోని దుర్గ వైన్స్ షట్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి రూ.3,45,600, 8 మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. మరుసటిరోజు వైన్స్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు తుర్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా వైన్స్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా కామారెడ్డి పట్టణానికి చెందిన పిన్నోజు రవి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్ మండలం గాగిలాపూర్‌కు చెందిన బైరప్పగారి హరీష్, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముసిపట్ల గ్రామానికి చెందిన శాఖాపురం నవీన్, సిద్దిపేట పట్టణానికి చెందిన చెప్యాల నర్సింహులు సోమవారం సాయంత్రం రెండు బైక్‌లపై సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ వైపు వెళ్తుండగా.. తుర్కపల్లి మండలం వాసాలమర్రి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా వైన్స్‌లో చోరీ చేసినట్లు నిజం ఒప్పుకున్నారని డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, రూ.2,04,000 స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుల్లో పిన్నోజు రవిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు, బైరప్పగారి హరీష్‌పై 6 కేసులు, శాఖాపురం నవీన్‌పై రెండు కేసులు ఉన్నాయని, పిన్నోజు రవికి కరీంనగర్ జైలులో హరీష్ పరిచయమయ్యాడని, వీరు బెయిల్‌పై బయటకు వచ్చి రాజాపేట వద్ద ఒక వైన్ షాపులో చోరీకి పాల్పడి తిరిగి నల్లగొండ జైలుకు వెళ్లారని డీసీపీ తెలిపారు. పిన్నోజు రవి, బైరప్పగారి హరీష్ నల్లగొండ జైలు నుంచి ఇటీవల బయటకు వచ్చిన నవీన్, నర్సింహులుతో కలిసి తుర్కపల్లిలోని వైన్ షాపులో చోరీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. వరుస చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీసీపీ వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, యాదాద్రి ఏసీపీ రమేష్‌కుమార్, యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్‌రావు, తుర్కపల్లి ఎస్ఐ తక్యోద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.